క్లుప్తంగా

ఘనంగా చండీహోమం



గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో వేంచేసి యున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా ఈ హోమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు తెలిపారు. హోమం నిర్వహించడం వలన ప్రజలు సుభిక్షంగా ఉంటారని, పాడి పంటలతో తులతూగుతారని భక్తులు విశ్వాసం అన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సెక్రటరి నారాయణ మురళీకృష్ణ, కోశాధికారి టంగుటూరి వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షులు పి.గోపాలకృష్ణ, సముద్రాల వెంకట జగ్గారావు, టీఎస్‌వీ సాంబశివరావు, చిన్నం గంగాధరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్‌ల పంపిణీ



మండవల్లి: మండవల్లి మండలం కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగదాసి థామస్ మాట్లాడుతూ విద్యార్థులు కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం ఎస్‌వై మాధవకుమార్, మాజీ సర్పంచ్ జి.కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు శ్యాంకుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మండవల్లి: మండవల్లి ప్రాథమిక పాఠశాల–2లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం సర్పంచ్ మెండా ఝాన్సీ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ హెచ్‌ఎం రాహేలు, ఏఎన్‌ఎం దుర్గ, ఆశ వర్కర్ బేగం పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



మండవల్లి: మండవల్లిలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు నిలవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో కాంట్రాక్టర్ సిబ్బంది వర్షం నీటిని ఇంజిన్లతో తోడి బయటకు పంపుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ నాగరాజు పేర్కొన్నారు.

పాఠశాల ఆవరణలో వర్షం నీరు



మండవల్లి: మండవల్లి ప్రాథమిక పాఠశాల–1లో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షం నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు తోడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

ముదినేపల్లి రూరల్: మండల పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై డి.వెంకటకుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో ఏడాది కాలంలో జరిగిన నేరాల్లో ఎనిమిది నేరాలు అపరిష్కృతంగా ఉన్నాయని, నిందితులను గుర్తించడంలో ఇప్పటికే పలు ఆధారాలు దొరికాయని తెలిపారు. మరిన్ని ఆధారాలు ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సరైన ఆధారాలతో నిందితులను త్వరలోనే అరెస్టు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య వార్తలను ప్రచారాలను మండల ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే పోలీసుస్టేషన్‌కి వచ్చి నేరుగా తనని సంప్రదించాలని కోరారు.

డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు

కైకలూరు: పుట్టిన బిడ్డకు అరగంటలోపే తల్లి ముర్రిపాలు అందిస్తే టీకా వేసిన ప్రయోజనం బిడ్డకు కలుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు షాహిదాఖానమ్, కృష్ణకుమారీ తెలిపారు. సింగాపురం, ఆటపాక గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ముర్రుపాల వల్ల బిడ్డలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 'అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలి' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కీర్తి, నాగేశ్వరీ, కుమారి, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మీ, నాగజ్యోతి, అలేఖ్య, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.



ఆటపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ కృష్ణకుమారి

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: తల్లి పాలతో పిల్లలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అన్నారు. చోరగుడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ధరణి, అంగనవాడీ కార్యకర్తలు రమాదేవి, రమ్యశ్రీ, పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. స్థానిక పెద్ద ఎరికపాడు ప్రైమరీ పాఠశాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.ఎం.లలితా మణి, ప్రమీలా రాణి, నవ్య, అరుణ, త్రివేణి, చల్లమ్మ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: తల్లిపాలలో పిల్లలకు అత్యధిక పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. ములకలపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన సదస్సుతో పాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించడం వలన పిల్లలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు, సుందరరామయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగమ్మ, భాగ్యలక్ష్మి, నాంచారమ్మ, ఆశ వర్కర్లు శారద, ఏఎన్‌ఎం కృపాసంతోషబాయి, షమీనా పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు వరం

మండవల్లి: తల్లిపాలు పుట్టిన బిడ్డకు వరం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట నాగలక్ష్మి అన్నారు. మండలంలోని కాకతీయనగర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం మిషన్‌శక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం 86.6 శాతం గర్భిణులకు ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. వారిలో 42 శాతం మాత్రమే పుట్టిన గంట లోపు తల్లిపాలను పట్టిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాలపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ పీబీ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు బి.దుర్గభవాని, కె ప్రశాంతి, ఆశవర్కర్ బి.నాగమణి పాల్గొన్నారు.



గుడివాడలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



మండవల్లి కాకతీయనగర్‌లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



ములకలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శివలింగానికి ప్రత్యేక పూజలు



కైకలూరులో శివలింగం ఊరేగింపు

కైకలూరు: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన మందిర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నందీశ్వర సహిత సహస్ర శివలింగం, చతుర్వేద శివలింగాలకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. ధ్యాన మందిర సేవా ట్రస్టు అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు, వెంకట ఆదిలక్ష్మి దంపతులు అయోధ్య పుణ్యక్షేత్రంలో శివలింగాన్ని త్వరలో ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు రోడ్ నుంచి గ్రామంలో శివలింగంతో ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముదినేపల్లి రూరల్: అస్వస్థతకు గురై శస్త్రచికిత్స చేయించుకున్న మండలంలోని వైవాకకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నగుల్ల దివాకర్‌ను మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం రాత్రి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, మోట్రు ఏసుబాబు, బత్తిన కిషోర్, దివి సతీష్, నున్న కనకరాజు, బోయిన నాగరాజు, నీలపాల రామకృష్ణ, శివాజీ, డీఎన్నార్ వెంట ఉన్నారు.



దివాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హులైన గిరిజన విద్యార్థుల కోసం డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను ఏర్పాటు చేశారని దీన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 30 మంది గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు కోచింగ్‌కు అర్హులని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీలో పొందిన మార్కుల ప్రకారం తయారు చేసిన మెరిట్ జాబితా ఆధారంగా, టెట్ సాధ్యాసాధ్యాల ప్రకారం ఏదైనా స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఉత్తీర్ణత సాధించి ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 95020 82159, 77949 27921 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సాగునీటి సర్దుబాటుకు రైతులు సహకరించాలి

కోడూరు: సాగునీటిని సర్దుబాటుతో పాటు దిగువ కాల్వలకు కూడా నీరు చేరేందుకు ఎగువ రైతులు సహకరించాలని ఇరిగేషన్ డీఈ రవికిరణ్ అన్నారు. మండలంలోని లింగారెడ్డిపాలెం ఎనిమిదో నంబర్ పంటకాల్వ పూడికతీత పనులను శనివారం డీఈ పరిశీలించారు. ఎగువ రైతులు సాగునీటిని ఆయిల్ ఇంజిన్లు, అక్రమ తూముల ద్వారా పొలాల్లో మళ్లిస్తున్నారని, దీంతో దిగువకు నీరు చేరడం ఇబ్బందికరంగా మారిందని డీఈ తెలిపారు. సాగునీటిని వృథా చేయకుండా రైతులు సమతౌల్యం పాటించాలన్నారు. ప్రతి ఒక్కరికి సాగునీటిని అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కోడూరు–అవనిగడ్డ ప్రధాన పంటకాల్వతోపాటు బ్రాంచ్ కాలువల్లో కూడా పూడికతీత పనులను చేస్తున్నామని తెలిపారు. దీంతో సాగునీరు పారడానికి ఎలాంటి అవరోధాలు లేవని డీఈ చెప్పారు. తీరప్రాంత కాల్వలకు కూడా నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పూడికతీత పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇరిగేషన్ ఏఈ విజయకుమార్, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాలు సేకరణ

పెనమలూరు: కేరళ వరద బాధితుల కోసం పోరంకిలో సీపీఎం నేతలు శనివారం విరాళాలు సేకరించారు. ఈ మేరకు సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడు త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పోరంకి నుంచి తాడిగడప సెంటర్ వరకు విరాళాలు సేకరించామన్నారు. కేరళలో జరిగిన ఘటన హృదయ విదారకమని, ప్రతిఒక్కరూ స్పందించి తమ వంతు సాయం అందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా కేరళ బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు షేక్.కాశిం, ఎస్‌కె.బాబు, మరీదు భాస్కరరావు,సుసులూరి సత్యనారాయణ, సీహెచ్.భవాని పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



ముదినేపల్లి రూరల్: రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏలూరు డీఎల్‌పీఓ కె.పూర్ణచంద్రశేఖర్‌ను ఆ సంఘం మండల నాయకులు శనివారం కోరారు. గ్రామాల్లో చెరువుల ఆక్రమణలు తదితర సమస్యలను డీఎల్‌పీఓ దృష్టికి తీసుకొచ్చారు. రజక సంఘ మండల శాఖ అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి నిడుమోలు హనుమంతరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా మల్లికార్జున్



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా పి.మల్లికార్జున్ విధుల్లో చేరారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు డీటీ బి.కనకదుర్గ, ఆర్‌ఐ షకీలాబేగం, రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఎన్నికల్లో పని చేసేందుకు ఇక్కడికి తహసీల్దార్‌గా డెప్యూటేషన్‌పై వచ్చిన ఎం.సునీల్‌కుమార్ తమ ప్రాంతానికి వెళ్లారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



కొండాయపాలెం(పామర్రు): పామర్రు మండలం పెదమద్దాలి శివారు కొండాయిపాలెంలో శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మద్దాలి ఏసుపాదం పరిశుద్ధంలకు సంబంధించిన గృహం ముందు రేకుల షెడ్డు, వెనకాల పాకతో ఉంది. శనివారం రాత్రి ఆ పాకలో కట్టెల పొయ్యి మీద వేడి నీళ్ల కాచుకుని పొయ్యి ఆర్పటం మర్చిపోయారు. తర్వాత భోజనాలు చేసి రేకుల షెడ్డులో నిద్రపోయారు. పాకలో ఉన్న పొయ్యి మంటను ఆర్పని కారణంగా మంట పాకకు అంటుకుని నిప్పులు పైకి లేచాయి. ఇది చూసిన ఇంతేటి గిరిబాబు అనే వ్యక్తి తక్షణమే స్పందించి కాలిపోతున్న ఇంట్లోకి వెళ్లి నిద్ర పోతున్న ఏసుపాదం పరిశుద్ధంలను ఇంట్లోనుంచి బయటకు తీసుకొచ్చి ప్రాణాలను కాపాడాడు. వీరు బయటకు రాగానే ఇంట్లో ఉన్న గ్యాస్ బండ పెద్ద శబ్దంతో పేలి పైకి ఎగిరి పడింది. గ్యాస్ బండ పేలడంతో పాకతో పాటు రేకుల షెడ్డు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు అన్ని అగ్నికి ఆహుతయ్యాయి. కట్టు బట్టలతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇల్లు దగ్ధమవుతున్న సమయంలో పామర్రు అగ్నిమాపక కార్యాలయానికి స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది రోడ్డు సరిగా లేదు, అక్కడకు వెళ్లేందుకు దారిలేదని కుంటి సాకులు చెప్ప కాలం వెళ్లదీశారు. దీంతో ఆ గృహం పూర్తిగా కాలిపోయింది. తర్వాత ఉయ్యూరుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మోపిదేవి: మోపిదేవి జాతీయ రహదారిపై ఎస్ విహార్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం మోపిదేవి వైపు నుంచి ద్విచక్రవాహనంపై చల్లపల్లి వెళుతున్న వృద్ధుడు నరసింహారావును వెనక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. ముందు వాహనంపై ఉన్న నరసింహారావు తలకు గాయం కాగా, వెనక నుంచి ఢీ కొట్టిన సోను కంటి వద్ద గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతూ ప్రమాదాన్ని గమనించిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా) సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకుని ఈఎంటీ వెంకట నరసయ్య, పైలెట్ చంద్ ప్రథమ చికిత్స చేసి చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యలు మా దృష్టికి తీసుకురావాలి

ఎంపీ బాలశౌరి

గుడివాడ టౌన్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తేవాలని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి మున్సిపల్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గుడివాడలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ఈ సమావేశం నిర్వహించామన్నారు. ప్రధానంగా టిడ్కో కాలనీ వాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కాలనీలో రూ. కోటి సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అమృత్ ఫేజ్–2, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు వృథా కాకుండా ప్రజల అభివృద్ధికి వినియోగించేలా అధికారులు దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యంగా బైపాస్ రోడ్, బస్టాండ్ నుంచి నాగవరప్పాడు వరకు ప్రధాన రహదారి అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం, టిడ్కో ఎస్ఈ చిన్నోడు, రెవెన్యూ, నేషనల్ హైవేస్, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల, ఆరోగ్య, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్రెయినేజ్, రవాణా, పబ్లిక్ హెల్త్, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న బాలశౌరి

పొంగిపొర్లుతున్న పుల్లేరు కాలువ



యాకమూరు వద్ద పొంగిపొర్లుతున్న పుల్లేరు కాలువ



కాలువలో భారీగా పేరుకున్న గుర్రపుడెక్క

తోట్లవల్లూరు: యాకమూరు వద్ద పుల్లేరు కాలువ పొంగిపొర్లుతోంది. కాలువ గట్లు బలహీనంగా ఉండటం, కాలువలో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవటంతో నీటి ప్రవాహం ముందుకు సాగటం లేదు. సాగునీటి ప్రవాహానికి గుర్రపుడెక్క, తూటుకాడ తీవ్ర అడ్డంకిగా మారటంతో కాలువ గట్లపై నుంచి నీరు పొంగి వృథాగా పోతోంది. ఎంతో విలువైన సాగు, నీరు వృథాగా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలువ గట్లు కోతకు గురై తెగితే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలువలో నీటి మట్టాన్ని తగ్గించి, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనమకూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్త యెనిగళ్ల చిన్నారి(50) హృద్రోగ సమస్యతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శనివారం సందర్శించి నివాళి అర్పించటంతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు నందేటి గంగాభవాని, బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, నాయకులు గవాస్కర్‌రాజు, వెంకటేశ్వరరావు, విజయ నాగరాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



యెనిగళ్ల చిన్నారి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

పమిడిముక్కల: అధైర్యపడకండి.. అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అగ్నిప్రమాద బాధితులకు భరోసా ఇచ్చారు. స్థానిక పంచాయితీ పరిధిలోని గుర్రాల్లంక పీహెచ్‌సీ పక్కనున్న రెండు పూరిళ్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎమ్మెల్యే కుమార్ రాజా ఆదివారం బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు సుబ్రమణ్యం, సిల్విబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ప్రత్యేక అవసరాల పిల్లలను 'భవిత'కు తీసుకురండి

పెడన: ప్రత్యేక అవసరాల పిల్లల్లో రాగలిగిన వారిని భవిత కేంద్రాలకు తల్లిదండ్రులు తీసుకురావాలని సమగ్ర శిక్ష కృష్ణాజిల్లా పీడీ రాములునాయక్ చెప్పారు. ప్రతి శనివారం భవితసెంటర్‌లో పనిచేసే సహిత విద్య రిసోర్స్‌పర్సన్లు హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా భవితసెంటర్‌కు హాజరు కాలేని బెడ్ రిడెన్ (మంచం మీద లేదా వీల్ చైర్ లో ఉండే) దివ్యాంగ పిల్లలకు కృత్యాధార బోధనను అందిస్తారు. దీన్ని పీడీ పెడనలోని 15, 16వ వార్డుల్లో పిల్లల బోధనను పరిశీలించారు. పట్టణంలోని ప్రత్యేక అవసరాల పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి పలు విషయాలపై ఆరా తీసి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. ఈ సందర్భంగా పీడీ ఇతర పిల్లలతో పాటు ఉంటే కొంత చైతన్యవంతులు అవుతారని తెలిపారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా ప్రభుత్వం ఫిజియోథెరపీ, ఉపకరణాలు, అలవెన్సులు, మెడికల్ క్యాంపులు, ట్యాబ్‌ల ద్వారా బోధన వంటివి అందిస్తున్నారని, వాటిని వినియోగించుకోవాన్నారు. ఆయనతో పాటు సెక్టోరల్ అధికారులు రామకృష్ణ, ఎ.సీతామహాలక్ష్మి, ఐఈఆర్పీలు కె.నవీన్, ఎస్.రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాల గల విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పీడీ రాములునాయక్